క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



పూజల్లో పాల్గొన్న ఆలూరు రమణారెడ్డి

బుక్కరాయసముద్రం: చెదల్ల గ్రామంలో సీతా రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కుటుంబం రూ.5 లక్షల విరాళం అందజేసింది. గురువారం ఆలయ ముఖ ద్వారం ఏర్పాటు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చెదల్లలో సీతారామాలయానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి సూచనల మేరకు రూ.5 లక్షలు విరాళం అందించినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ అంజిన్‌రెడ్డి, నాయకులు శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రంగారెడ్డి, చెన్నారెడ్డి, చికెన్ నారాయణస్వామి, రుషిగప్ప, వెంకటరాముడు ,రాములప్ప, నాగముణి, లక్ష్మినారాయణరెడ్డి, కేశవరెడ్డి, ఎర్రినాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓట్ల తొలగింపు

గార్లదిన్నె: ఓట్ల తొలగింపును పారదర్శకంగా చేపట్టాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఓబులమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె ఇల్లూరు, గార్లదిన్నెలో ఓట్ల తొలగింపుపై విచారణ చేపట్టారు. తహసీల్దార్ ఉషారాణి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా అనిత



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

శింగనమల: మండల సమాఖ్య నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం నారాయణస్వామి తెలిపారు. వైకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం జరిగింది. సమాఖ్య అధ్యక్షురాలిగా ఎం.అనిత(మదిరేపల్లి), ఉపాధ్యక్షురాలిగా దస్తగిరమ్మ(ఈస్ట్ నరసాపురం), కార్యదర్శిగా గంగాదేవి(తరిమెల), కోశాధికారిగా శంకరిభాయి(ఎన్‌జీ తండా),సహాయ కార్యదర్శిగా అనంతమ్మ (రాచేపల్లి)ను ఎన్నుకున్నారు.


ఇళ్లు నిర్మించకుంటే పట్టాలు రద్దు చేస్తాం



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయ భాస్కర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ

బుక్కరాయసముద్రం: మండలంలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్లు నిర్మించకుంటే ఇంటి పట్టాలతోపాటు ఆన్‌లైన్‌లో మంజూరైన ఇంటిని రద్దు చేస్తామని ఎంపీడీఓ విజయభాస్కర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జగనన్న హౌసింగ్ కాలనీలోని లేఅవుట్ 1, 2, 3, 4, 5లను పరిశీలించారు. కాలనీల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల వివరాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారంలోగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించకుంటే ఇంటి పట్టాతో పాటు మంజూరు చేసిన ఇంటిని రద్దు చేస్తామన్నారు. ఇప్పటికే అనేక మార్లు నోటీసులు ఇచ్చామని గుర్తు చేశారు. ఇళ్లు నిర్మించుకునేవారికి ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈఓఆర్‌డీ దామోదరమ్మ, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'జి-20 మాక్ సమ్మిట్'



జి-20 మాక్ సమ్మిట్ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ మనోహర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన జి-20 మాక్ సమ్మిట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా క్లైమేట్ చేంజ్, యాంటీ కరప్షన్, యాంటీ టెర్రరిజమ్, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ క్లైమేట్ చేంజ్ వంటి అంశాలపై 20 దేశాల(పాఠశాలలు) ప్రతినిధులు (విద్యార్థులు) చర్చించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ కంటి వెలుగు' వరం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- 969 మంది వృద్ధులకు కళ్లద్దాల పంపిణీ



వృద్ధురాలికి కళ్లద్దాలను అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి రాఖీ కడుతున్న మహిళ

తాడిపత్రి అర్బన్: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం అన్ని వర్గాలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని నూతన కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 38 జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని, డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్ - 3 లో భాగంగా వృద్ధులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటి పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నారన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఐదు విడతల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అంధత్వ నివారణలో భాగంగా తాడిపత్రిలో ఇది వరకే ఫేజ్ – 3 కింద 131 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారని, ప్రస్తుతం 969 మందికి కళ్లద్దాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎవరైనా తమ కళ్లను దానం చేయాలనుకుంటే టెక్నీషియన్ నాగరాజును సంప్రదించాలని ఆఫ్తాలమిక్ ఆఫీసర్ గోపాల్ తెలిపారు. కళ్లను దానం చేసిన, చేయాలనుకున్న వారు మరణించిన వెంటనే వారి కుటుంబ సభ్యులు సమాచారం అందిస్తే జిల్లాలో ఎక్కడ ఉన్నా 6 గంటల్లో వచ్చి కళ్లను తీసుకువెళతారన్నారు. ఇందుకోసం 7674046757 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడ్డాం

తాడిపత్రి అర్బన్: ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన పట్టణంలోని 7 వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని, ప్రతి గడప వద్ద మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పారదర్శకతకు పెద్దపీట వేశారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కుల,మత, వర్గ, పార్టీ భావం లేకుండా గడప వద్దే అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాడిపత్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నా కొందరు అడుగడుగునా అడ్డుతగులుతున్నారన్నారు. తాడిపత్రి ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన తాము ముందుండి పోరాడతానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, రాబర్ట్, నాయకులు మురళీ, రామాంజినేయులు, ఓబులేసు, వెంకటస్వామి, సాయికృష్ణ, జావీద్, మాజీ కౌన్సిలర్ డీవీ కుమార్, బాబు, లక్ష్మిరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



డీఆర్ఎంకు రాఖీ కడుతున్న శాంతికుమారి

గుంతకల్లు: స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయంలో ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం సంచాలకులు రాజయోగి శకుంతల డీఆర్ఎం మనీష్ అగర్వాల్, డీఎస్పీ నర్సింగప్ప, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంవీఐ రాంబాబులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పెద్దవడుగూరు: మండలం కేంద్రంలో ఓంశాంతి సభ్యులు పంచలోహాలతో తయారు చేసిన శివలింగాన్ని గురువారం ఊరేగించారు. ఈ సందర్భంగా ఓంశాంతి సభ్యురాలు శాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలన్నారు. ధ్యానంతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం రక్షాబంధన్ ప్రాముఖ్యతను తెలియజేశారు.

పామిడి: పట్టణంలో గురువారం భావసార క్షత్రియులు రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అక్కలు, చెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి మిఠాయిలు పంచిపెట్టారు.

గుత్తి: పట్టణంలోని ఓం శాంతి కార్యాలయంలో గురువారం రక్షా బంధన్ వేడుకలను ఓం శాంతి మహిళలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరాలు వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ శాంతి మహిళలు అందరికీ రాఖీ కట్టారు.

రేపు వైఎస్సార్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: అనంతపురం- తాడిపత్రి జాతీయ రహదారిపై మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద శనివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కులమత, రాజకీయ, ప్రాంతాలకు అతీతంగా పరిపాలన అందించారన్నారు. నేటికీ వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, 108, ఆరోగ్యశ్రీ, తాగు, సాగునీటి ప్రాజెక్టులు, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు తెలుగు రాష్ట్రాలలో అమలవుతున్నాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్లుగా సీఎంగా ఉన్నా చెప్పుకోదగ్గ ఒక్క పథకం అయినా ఉందా అని ప్రశ్నించారు. వైఎస్సార్ తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర, దేశంలోనే ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు చికెన్ నారాయణస్వామి, చేపల రమణ, పురుషోత్తం, సాకే లక్ష్మినారాయణ, లచ్చి, శివ పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి



సమస్యలు తెలుసుకుంటున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మరో మారు జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. గురువారం కోమలి గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో పాలకులు తాడిపత్రి నియోజకవర్గాన్ని అధోగతి పాలు చేశారన్నారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, పెద్దపాడమల సర్పంచ్ శ్రీనివాసులు, చిన్నపాడమల ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి, యర్రగుంటపల్లి ఎంపీటీసీ కిశోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రంగారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీటీడీ సభ్యుడికి సన్మానం



అశ్వత్థనాయక్‌ను సన్మానిస్తున్న సేవాలాల్ ట్రస్టు సభ్యులు

గుత్తి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ సభ్యుడిగా నియమితులైన అశ్వత్థనాయక్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. సేవాగఢ్‌లోని సేవాలాల్ మహారాజ్ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సంత్ సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు కొర్రా జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సేవాగఢ్‌కు వచ్చిన టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వత్థనాయక్‌ను ట్రస్టు సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం టీటీడీ సభ్యుడికి సేవాలాల్ చిత్రపటాన్ని అందించి శాలువా, పూలమాలతో సత్కరించారు. అశ్వత్థనాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ట్రస్టు వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, సభ్యులు బూక్య వెంకటరమణనాయక్, శేఖర్‌నాయక్, బాలనాయక్, రంగ్లనాయక్, అర్చకుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



గుంతకల్లుటౌన్: కౌన్సిల్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని



గుత్తి: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 14 శివారు కాలనీలతో పాటు వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్ మాణిక్యం మాట్లాడుతూ తన వార్డులో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు అదనంగా పీహెచ్ వర్కర్లు కేటాయించాలని కోరారు. తమ వార్డు కుల, ఆదాయ, ఇతర రెవెన్యూ పరమైన సర్టిఫికెట్ల జారీ కోసం డబ్బు వసూలు చేస్తున్న వీఆర్‌ఓ రామలింగప్పపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ కెవి. నాగరత్న మాట్లాడుతూ వార్డు సచివాలయ మరమ్మతు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ మెహరున్నీసా మాట్లాడుతూ తన వార్డులో నీటి సమస్యను పరిష్కరించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్లు కృపాకర్, ఆంజనేయులు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగట్లేదని, పట్టణాభివృద్ధి పేరిట రోడ్ల విస్తరణ కోసం అధికారులు చేపట్టిన చర్యలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద రోడ్డు విస్తరణ చేయించి తిరిగి అక్కడ బంకులు వేయించడమేంటని వారు ప్రశ్నించారు. చైర్‌పర్సన్ భవానీ బదులిస్తూ మాస్టర్‌ప్లాన్ ప్రకారం 60 అడుగులు వదిలేసి మిగిలిన స్థలంలో నిరుపేదలైన వీధివ్యాపారులు బంకులు ఏర్పాటు చేసుకుని బతుకుతున్నారని, వారి కడుపుకొట్టడం ప్రతిపక్ష కౌన్సిలర్లకు మంచిదికాదన్నారు. 14 శివారు కాలనీల్లో ఒక్కో వార్డుకు రూ.10 లక్షల 14వ ఆర్థిక సంఘం నిధులతో టెండర్లు పిలువగా పాత ఎస్ఎస్ఆర్ రేట్ల కారణంగా కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీంతో కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం తిరిగి ఆ వార్డుల్లో పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 11వ వార్డు సచివాలయానికి ఉన్న హరిజనవాడ పేరును తొలగించి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సచివాలయంగా నామకరణం చేశారు. అలాగే పోర్టర్స్ లైన్ దర్గా పరిసరాల్లోని కాలనీకి హజరత్ గులాంషా ఖాద్రీనగర్‌గా నామకరణం చేస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కమిషనర్ వి.మల్లికార్జున, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు అధికారులలు పాల్గొన్నారు.

భూసేకరణ కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు

గత 18 ఏళ్లుగా రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్న నాయీబ్రాహ్మణకాలనీ(మోదినాబాద్)కి 40 అడుగుల రోడ్ ఏర్పాటుకు అవసరమైన కొంత ప్రైవేట్ స్థలాన్ని సదరు యజమాని నుంచి భూసేకరణ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ధర్మవరం రైల్వేగేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి 202 ప్రైవేట్ భవనముల భాగాలను భూసేకరణ చేసేందుకుగానూ కలెక్టర్‌కు ప్రతిపాదిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

తాగునీటి ఎద్దడిపై నిలదీత

గుత్తి: తాగునీటి ఎద్దడిపై అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. 7వ వార్డు కౌన్సిలర్ వరదరాజులు గుత్తి ఆర్‌ఎస్‌లోని 9 వార్డుల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని సభ దృష్టికి తెచ్చారు. గుత్తికి వచ్చే వైటీసీ తాగునీటి పథకం నీటిని వారంలో మూడు రోజులు గుత్తి ఆర్‌ఎస్‌లోని 9 వార్డులకు ఇవ్వాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు నజీర్, ఖాజా ఖాన్, అరవింద్, బుస్సా రూపావతి, కేవీ రమణ, నరేష్, కృపా సుజాత, శివ,రాజేశ్వరి తదితరులు తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాల సమస్యలపై గళం విప్పారు. సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు ప్రస్తావించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

వైభవంగా నారాయణుడి కల్యాణం



స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు సుధీర్‌కుమార్ శర్మ

పెద్దపప్పూరు: నిజ శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా గురువారం అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్య శర్మ నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి కల్యాణం జరిపించారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యుడు గంగిరెడ్డి తీర్థప్రసాదాలతోపాటు అన్నదానంఏర్పాటు చేశారు.

రామాలయం పరిశీలన

శింగనమల: శింగనమలలోని పురాతన రామాలయాన్ని టీటీడీ అధికారులు గురువారం పరిశీలించారు. ఆలయాభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి టీటీడీ అధికారులను కోరారు. ఈ మేరకు టీటీడీ అధికారి డిల్లీరెడ్డి ఆలయాన్ని పరిశీలించి దేవదాయ, పురావస్తు అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

కొజ్జేపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

గుత్తి రూరల్: కొజ్జేపల్లిలో డబ్బు విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడి ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చింతకాయల రవి, ఈశ్వరపల్లికి చెందిన లాలుస్వామితో 4 నెలల క్రితం రూ.1.25 లక్షలకు ఆటో కొనుగోలు చేసి రూ.1.15 లక్షలు చెల్లించాడు. రిజిస్ట్రేషన్ అనంతరం రూ.10 వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే లాలుస్వామి కొజ్జేపల్లికి చెందిన పాపన్నకు రూ.10 వేలు బకాయి ఉండటంతో వాటిని మధ్యవర్తి రమేష్ ద్వారా పాపన్నకు ఇచ్చేయాలని చెప్పాడు. రూ.10 వేల విషయంపై బుధవారం అర్ధరాత్రి రమేష్, పాపన్న వర్గాలు ఘర్షణ పడి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘర్షణలో మోహన్ బాబు, రమేష్, లక్ష్మీదేవితో పాటుగా మరో వర్గంలోని వారు గాయపడ్డారు. గాయపడ్డ వారిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నిరుపేదలకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలో నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద టిడ్కో ఇళ్లు మంజూరు చేయాలని ఆర్‌డీఓ రవీంద్రను బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు కోరారు. గురువారం ఆర్‌డీఓను ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వడ్డేర మేష్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బీజేపీ నేతలు బండారు కృష్ణమూర్తి, పద్మ, కృష్ణమూర్తి, రవి, బండిమురళీ, ప్రమోద్ పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే కేసు నమోదు చేస్తాం

యల్లనూరు: గ్రామాల్లో ఎవరైనా సమస్యలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం ఆయన పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి కేసుల వివరాలను ఎస్ఐ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు.

మోదీని గద్దె దింపడమే లక్ష్యం

గుంతకల్లు: ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దింపడమే ఇండియా కూటమి లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ అన్నారు. గురువారం ముంబాయిలో జరిగే ఇండియా కూటమి సమావేశం సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో జగదీష్, నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జ్ దౌల్తాపురం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. జగదీష్ మాట్లాడుతూ ఇండియా కూటమితోనే బీజేపీ కౌంటౌన్ మొదలైందన్నారు. ఈ సందర్భంగా పావురాలను ఎగురవేసి కూటమి లక్ష్యం నెరవేరాలని కాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, గోపీనాథ్, రాము రాయల్, ఎస్ఎండి గౌస్, రామాంజనేయులు, ఈశ్వరయ్య, వర్కింగ్ తలారి సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

5న తలనీలాల వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం 5న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాడిపత్రి: సజ్జలదిన్నె వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

తాడిపత్రి అర్బన్: నందలపాడు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం సీజ్ చేశారు. డ్రైవర్ రవికుమార్‌ను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

తాగునీటి అవసరాలకే కృష్ణా జలాలు

గుంతకల్లు రూరల్: గుంతకల్లు సబ్ బ్రాంచ్ కెనాల్ ద్వారా సరఫరా అవుతున్న కృష్ణా జలాలను తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని జీబీసీ డీఈఈ మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం తగ్గిన కారణంగా కృష్ణా జలాలను వ్యవసాయానికి ఉపయోగించవద్దని ఆయన ఆయకట్టు రైతులకు సూచించారు.

రాఘవేంద్రస్వామి పూర్వారాధన

తాడిపత్రి అర్బన్: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం పూర్వారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లలితాదేవి ఆలయం సమీపంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో గురువారం స్వామి 352వ ఆరాధనోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి బృందావనాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున 5 గంటలకు నిర్మల్య విసర్జన అనంతరం స్వామి బృందావనానికి పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం సామూహిక సత్యనారాయణ పూజ నిర్వహించారు. స్వామి పాద పూజ, కనక మహాపూజ, తులసీ దళార్చన చేశారు. మహామంగహారతి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

శ్రీకృష్ణజన్మాష్టమి కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరా

పామిడి: పట్టణంలో ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకూ కృష్ణజన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రబోధసేవా సమితి సభ్యులు తెలిపారు. గురువారం ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, ఇన్‌చార్జ్ సీఐ షేక్ చాంద్‌బాషా వేడుకలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు సూర్యనారాయణ, చంద్రశేఖర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

గుత్తి: స్థానిక కర్నూలు రోడ్డులో జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం అనంతపురం ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు అందిస్తామని నిర్వాహకుడు చెప్పారు. హెచ్ఎం ఉషారాణి, పీఈటీ శ్యామల పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలుకు చెందిన నజీర్ పని నిమిత్తం బైక్‌పై గుంతకల్లుకు బయలుదేరాడు. రజాపురం శివారులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న మట్టికుప్పను గమనించకుండా వెళ్లడంతో బైక్ అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన వాహనదారులు 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యల్లనూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు.. నీర్జాంపల్లి సమీపంలో గురువారం రెండు ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో శ్రీకాంత్, జ్యోతి, హరితో పాటు ఇర్ఫాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: మెడికల్ కళాశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి డబ్బు కాజేసిన ఓ వ్యక్తిపై అర్బన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ కథనం మేరకు.. పట్టణంలోని జయనగర్‌కాలనీలో నివాసముంటున్న గౌసియా కూతురు కరిష్మా విజయవాడ చైతన్య కళాశాలలో ఇటీవలే ఇంటర్ బైపీసీ పూర్తి చేసింది. వైఎస్సార్ జిల్లా చాపాడుకు చెందిన రమేష్ అనే వ్యక్తి కరిష్మా తల్లి గౌసియాకు ఫోన్ చేసి నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు ఇప్పిస్తానని చెప్పాడు. ఈమేరకు విడతల వారీగా రూ.2.3 లక్షలు ఫోన్ పే ద్వారా రమేష్ ఖాతాలో వేయించుకున్నాడు. రెండు రోజుల నుండి కరిష్మా తల్లి గౌసియా రమేష్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో అనుమానం వచ్చి గురువారం సాయంత్రం అర్బన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.